
# చప్పట్లు

- పి.ఎం. సుందరరావు

"అదిగో ఆవిడే రంగనాథం గారి భార్య".

"అవును. చాలా సాత్వికురాలిలా వుంది".

"అలాంటి మహానుభావుడికి భార్య కావడం నిజంగా ఆవిడ చేసుకున్న అదృష్టం". అలా ఎవరో తెలిసినవారు, తెలియనివారు అనుకునే మాటలు వేదిక ముందు కూర్చున్న సావిత్రి చెవుల్లో దూరిపోతున్నాయి. కాదు మార్మోగిపోతున్నాయి.



"నిజమేనా?"

"నేను సాత్వికురాలినా?"

"నేను నిజంగా అదృష్టవంతురాలినా?"

మనసులో పదే పదే అనుకోసాగింది. అందరూ వచ్చి తనకు నమస్కరించి పోతుంటే, కొంత ఇబ్బందిగానే ప్రతి నమస్కారం చేస్తూ పైట నిండుగా కప్పకుంది.

ఒక పక్క ఆనందం! మరో పక్క ఏదో తెలియని విషాదం!

ఒక్కసారి ఆ హాలంతా పరికించి చూసింది. అందరూ ఎంతో ఆత్మీయుల్లా కనిపించారు. ప్రతి వారిలోనూ రంగనాథం గారి మీద అభిమానం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అందరిలోనూ ఏదో భక్తి. మంచి క్రమశిక్షణ.

వారంతా నిజంగా రంగనాథం గారి ఆత్మీయులే. కాకపోతే కళాభిమానులై వుండాలి. కళాభిమానులైతే రంగనాథం గారి అభిమానులే

అవును మరి! రంగనాథం గారంటే కళలకు మారుపేరు. కళాకారుడికి పర్యాయపదం. నటనకు భాష్యం.

ఒక్కసారి గట్టిగా కళ్ళు మూసుకుని తెరిచింది సావిత్రి. జలజలా నాలుగు కన్నీటి బొట్లు రాలాయి. మళ్ళీ అప్పటి జ్ఞాపకాలు మెదులుతున్నాయి.

*** *** ***

ఓసారి స్టేజీ మీద ప్రదర్శించిన నాటకంలోని

నటనకు ముగ్ధురాలై రంగనాథంని ప్రేమించింది సావిత్రి.

రంగనాథం ఆస్తిపరుడు కాదు. మంచి నటుడు. మంచి నాటక రచయిత. తనను ప్రేమించిన సావిత్రి పెళ్ళిచేసుకోమని అడిగినప్పుడు తన గురించి అన్నీ చెప్పాడు. "నీవు ధనవంతుల అమ్మాయివి. నేను ధనానికి దూరంగా, కళలకు దగ్గరగా వుండే వాడిని. నాతో పెళ్ళి వద్దు" అని పదేపదే చెప్పాడు.

అయినా వినలేదు సావిత్రి. గట్టిగా పట్టుపట్టింది. తల వంచక తప్పలేదు రంగనాథంకి.

ఇద్దరూ ఒక్కటయ్యారు.

కళ తప్ప కానులు లేనివాడిని పెళ్ళి చేసుకున్నందుకు ఇంట్లోకి రానివ్వలేదు సావిత్రి తల్లిదండ్రులు. కన్నవారితో శాశ్వతంగా తెగతెంపులు చేసుకుంది.

రంగనాథానికి బాగా తెలిసిన ఓ మిత్రుడు మునిసిపాలిటీలో మంచి ఉద్యోగం వేయించాడు. కొన్నాళ్ళు సంసారం బాగానే గడిచింది. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల కలిగారు. వారికి హరిబాబు, కళాధర్, భూమిక అని పేర్లు పెట్టుకున్నాడు.

సొంతంగా ఒక నాటకం వ్రాసుకుని, తానే దర్శకత్వం వహించి, రాష్ట్రంలోని వివిధ పరిషత్తులు నిర్వహించిన పోటీల్లో ప్రదర్శించి అనేక బహుమతులు కైవసం చేసుకున్నాడు. నటుడిగా ఎంతో పరిణతి సాధించాడు. అనేక సన్మానాలు పొందాడు.

ఇంతలో తన ఉద్యోగంలో అపశ్రుతి ఏర్పడింది. ఓ తప్పుడు ఫైలు మీద సంతకం పెట్టలేదనే నెపంతో ఆ వూరి మునిసిపల్ ఛైర్మన్ రంగనాథాన్ని ఉద్యోగం నుంచి శాశ్వతంగా సస్పెండు చేయించాడు.

అయినా రంగనాథం బాధపడలేదు. తన కళాభినివేశాన్ని ఒదిలిపెట్టలేదు. ఇతర ఉద్యోగ ప్రయత్నం చేయలేదు. పూర్తి సమయాన్ని నటనకు, రచనకు ఉపయోగించాడు. నటుడిగా, రచయితగా బాగా పేరు సంపాదించాడు. కానీ ఆర్థికంగా బాగా ఇబ్బందులకు గురయ్యాడు.

ఓసారి బాగా తెలిసిన ఓ మిత్రుడు ఆర్థికంగా వెనకబడి వున్న పేద కళాకారులను ఆదుకోవడానికి, అందుకోసం చందాలు వసూలు చేసే అవకాశం కోసం రంగనాథంను సంప్రదించాడు. అందుకు తనవంతు కృషిగా ఒక పౌరాణిక నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తానని హామీ ఇచ్చాడు.

ఆరోజు నాటక ప్రదర్శన రోజు. ఆ వూరికి యాభై కిలోమీటర్ల దూరంలో వున్న ఊరికి ప్రదర్శన నిమిత్తం బయలుదేరాడు. తను బయటి వూరికి ఎక్కడికి వెడుతున్నా పెద్దకొడుకు హరిబాబును కాసేపు ఎత్తుకుని ముద్దాడి గాని వెళ్ళడు.

అందుకే హరిబాబు కోసం ప్రక్క గదిలోకి వెళ్ళాడు. మంచం మీద స్పృహ లేకుండా పడుకుని వున్నాడు హరిబాబు. పక్కన ఏడుస్తూ కూర్చున్నారు సావిత్రి, పిల్లలు.

అనుమానంగా హరిబాబు ఒంటి మీద చేయి వేశాడు. శరీరం వెచ్చగా కాలిపోతోంది. తక్కున చేతిని వెనక్కి లాక్కున్నాడు. సావిత్రికేసి చూశాడు.

ఏడ్చి ఏడ్చి సావిత్రి కళ్ళు ఎర్రగా వున్నాయి.

"ఏమిటండీ అలా చూస్తున్నారు? బాబుకు జ్వరమండీ! మూడు రోజుల నుంచి మూసిన కన్ను తెరవడం లేదు. అవును. మూడు రోజుల నుంచి రిహార్సల్స్ అని ఇంటికే రాని మీకు ఈ విషయమెలా తెలుస్తుంది? మీకు భార్యా బిడ్డలు ముఖ్యం కాదు. నటన ముఖ్యం. కళ ముఖ్యం" అని ఏదేదో ఆవేశంగా మాట్లాడింది సావిత్రి.

రంగనాథం ఏం మాట్లాడలేకపోయాడు. సావిత్రి ఆవేశాన్ని అర్థం చేసుకున్నాడు. ఆ పరిస్థితిలో ఏ తల్లి అయినా అలాగే మాట్లాడుతుందని మౌనంగా వుండిపోయాడు.

"ఏమిటండీ! మౌనంగా వుండిపోయారు? ఇంట్లో డబ్బులు లేవు. ఎవరో ఒకరిని బతిమిలాడి డబ్బులు తీసుకురండి. బాబుని డాక్టరుకి చూపించుదాం. లేకపోతే బిడ్డ బ్రతకడండీ!" అని రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ భోరున ఏడ్చింది.

ఏం చేయాలో అర్థం కాక సావిత్రిని దగ్గరకు తీసుకున్నాడు.

"సావిత్రీ! ట్రైన్‌కి టైమయ్యింది. నేను వెళ్ళకపోతే ప్రదర్శన ఆగిపోతుంది. అవతల ఆర్గనైజర్స్ ఇబ్బంది పడతారు. వాళ్ళని ఇబ్బంది పెట్టడం




కేశవర్ధిని...
పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె.
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్ది చుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో
కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి
ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ
లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ మద్రాసు-600 087

మనకు మంచిది కాదు. పైగా ఇది .పేద కళాకారుల కోసం ఏర్పాటు చేసిన ప్రదర్శన. నేవే ఎలాగయినా బాబుకు వైద్యం చేయించు. అయినా ఇది మామూలు జ్వరమే సావిత్రీ! బాబుకు ఏ ప్రమాదం వుండదు" అన్నాడు అనునయంగా.

ఆ మాటలు విని సావిత్రి భద్రకాళి అయ్యింది. ఏమీ పట్టించుకోకుండా తన బృందంతో కలిసి రైలెక్కడానికి బయలుదేరాడు రంగనాథం.

అక్కడ మంచి ప్రదర్శన ఇచ్చాడు రంగనాథం. కలెక్షన్స్ బాగా వచ్చాయి. రంగనాథం చేసిన ఆ మంచి పనిని చిన్నా పెద్దా అందరూ ప్రశంసించారు.

ఇంటి దగ్గర ఊహించని సంఘటన. సావిత్రి ఏడ్పులు హృదయాన్ని కలచివేసే విధంగా వున్నాయి. తన పెద్ద కొడుకు హరి చనిపోయి వున్నాడు. గుండెను దిటవు చేసుకుని సావిత్రిని ఓదార్చే బాధ్యతను తీసుకున్నాడు. తను కూడా ఏడిస్తే ఆవిడ గుండె ధైర్యం కోల్పోవచ్చు. కానీ సావిత్రి రంగనాథం చేతిని విదిలించి కొట్టింది. ముఖం పక్కకు తిప్పకుంది మాట్లాడవద్దన్నట్టుగా.

ఆలోచిస్తున్నాడు రంగనాథం. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. ఇంట్లో వున్న షీల్డులు, వెండి కప్పులు అమ్మగా వచ్చిన డబ్బుతో ఖనన క్రతువులు పూర్తిచేశాడు.

*** *** ***

కొడుకు పోయిన దుఃఖం నుంచి కోలుకోవడానికి సావిత్రికి చాలా రోజులు పట్టింది. ఎప్పుడూ అవే జ్ఞాపకాలు మెదులుతుంటే ఏ పనీ చేయలేక దిగులుగా వుండేది. జీవితం మీద విరక్తిగా అన్పిస్తోంది. అయితే మిగిలిన ఇద్దరు పిల్లల భవిష్యత్తు కోసం మాత్రం ఆమె కూడా గుండె దిటవు చేసుకుంది. ఎంత చెప్పినా ఈ మనిషి మారతాడన్న నమ్మకం లేదు. ఈ వృత్తిని వదిలిపెట్టి ఏదైనా ఉద్యోగం చేస్తాడన్న ఆశ అంత కంటే లేదు. అయినా తన ప్రయత్నం తాను చేయాలి.

ఒక రోజు రంగనాథం దగ్గరకు తీసుకున్నప్పుడు చిన్నగా విషయం ప్రస్తావించింది.

"ఏమండీ! అన్నీ తెలిసే మిమ్మల్ని ప్రేమించాను. పెళ్ళి చేసుకున్నాను. కాని మీరు కళారాధనలో మునిగి కళకు అంకితమై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అందుకు హరి ప్రాణాల్ని మూల్యంగా చెల్లించాం! నా మాట వినండి! ఇప్పటికైనా మించిపోయింది లేదు. మిగిలిన ఇద్దరు పిల్లల్ని కాపాడుకోవాలంటే మీరు ఏదో ఒక ఉద్యోగం చేయాలి. కూడు పెట్టని కళకు ఎన్నాళ్ళు నమ్ముకుంటాం! అది మనల్నే బలి తీసుకుంటుంటే ఎలా ఓర్చుకుంటాం? దయ చేసి నామాట వినండి. మీకు చేతులెత్తి దణ్ణం పెడతాను! ఈ కళను వదిలి పెట్టండి. మారుతున్న కాలంతో పాటు మనం కూడా మారాలండీ! పిల్లలకి అన్యాయం చేయకండి!" అంటూ అభ్యర్థించింది. అయినా రంగనాథం సూటిగా సమాధానమివ్వలేదు.

తెల్లవారిన తర్వాత కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించింది సావిత్రి. అయినా వినలేదు రంగనాథం. తను ఏది తలిస్తే అదే కరెక్టు. మొండి వాడు. రంగనాథాన్ని విడిచి వెళ్ళలేక జీవచ్ఛవంలా అలా వుండిపోయింది.

"రంగనాథం పట్టుదలకు మారుపేరు. తను ఎంచుకున్న మార్గంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా కళను వీడకుండా, అంతిమ శ్వాస వరకూ కళ కోసం జీవించిన వ్యక్తి" అని ఎవరో అంటున్న మాటలు చెవిన పడడంతో ఆలోచనల్తో, ఆ జ్ఞాపకాలతో ఎటోవెళ్ళిపోయిన సావిత్రి ఈ లోకంలోకి వచ్చింది.

ఆ మాటలన్న వ్యక్తిని గుర్తు పట్టింది. కానీ అప్పటికీ, ఇప్పటికీ ఆ మనిషిలో ఎంత తేడా! ఆ వ్యక్తి ఒకప్పుడు పదేళ్ళ సినీ రంగాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన నటుడు రాజమోహన్. ఇప్పుడు జీవిక కోసం అందర్నీ అభ్యర్థిస్తున్న అభాగ్యుడు. సావిత్రిని చూసి నమస్కరించి పక్కన కూర్చున్నాడు.

సావిత్రి ప్రతి నమస్కారం చేసింది. ఒక్కసారి తేరిపార చూసింది రాజమోహన్‌ని. అప్పటి ఆ ఠీవీ, దర్జా లేవు. ఓడలు బండ్లు అవుతాయన్న సామెతకు నిలువుటద్దంలా వున్నాడు.

అయిదేళ్ళ క్రితం జరిగిన సంఘటన జ్ఞప్తికి వచ్చింది సావిత్రికి.

*** *** ***

"రంగనాథం గారూ! నటునిగా మీగురించి ఎంతో మంది చెబుతుంటే విన్నాను. ఇప్పుడు మీరు వ్రాసిన 'ఈ జీవన ప్రయాణం' నాటకం చదివాను. చాలా బావుంది. మీలాంటి వారు సినీ రంగంలో వుంటే రెండు చేతులా సంపాదించవచ్చు. ఇండస్ట్రీని మొత్తం మీ వెంట తిప్పకోవచ్చు. ఇంకో విషయం! మీరు వ్రాసిన 'ఈ జీవన ప్రయాణం' నాటకాన్ని కొద్ది మార్పులతో సినిమాగా రూపొందించడానికి మీరు ఒప్పకుంటే నిర్మాతలకు నేను రికమెండ్ చేస్తాను. ఆలోచించండి. మీ భవిష్యత్తు మారిపోతుంది" అన్నాడు రాజమోహన్ రంగనాథం చేతులు పట్టుకుని.

ప్రఖ్యాత సినీనటుడు అలా స్వయంగా తమ ఇంటికి వచ్చి తన భర్తను అలా అడుగుతుంటే ఆరోజు ఎంతో పొంగిపోయింది తాను.

"రాజమోహన్ గారూ! సినిమాల్లో ఎంతో బిజీగా వుండీ, నాకోసం ఇంత దూరం వచ్చినందుకు చాలా సంతోషం. నేను డబ్బుకోసం కళాకారుడిని కాలేదు. డబ్బు కోసం నటించడం లేదు. ఇంకో విషయం. నేను ఎన్నో జీవితాలని చూసి, ఆ జీవితాల్లోని విభిన్న పార్శ్వాలను గమనిస్తూ వ్రాసినది 'ఈ జీవన ప్రయాణం' నాటకం. సినిమా కోసం ఇందులో ఒక్క అక్షరం కూడా మార్చడానికి ఒప్పకోను. ఒక్కమాటలో చెప్పాలంటే నేను నా కళను ఆ మాయాజాలానికి తాకట్టుపెట్టను" అని రంగనాథం సమాధానం చెప్పినప్పుడు 'ఈయన బాగుపడడు, మమ్మల్ని బాగుపడనీయడు' అని కృంగిపోయింది.

మందులకు అంతుబట్టని మహమ్మారి కేన్సర్ రంగనాథాన్ని కబళించడంతో సావిత్రి పిల్లలకు తానే అన్నీ అయి పెంచి పెద్ద చేసింది. తనకున్న డిగ్రీతో ఓ ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగా చేరి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసింది. కళాధర్‌కు సెంట్రల్ సర్వీసెస్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. భూమికను ఒక ఇంజనీరు ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. గతమంతా రీళ్ళుగా తిరుగుతుండడంతో మనసు దిగులుగా, బాధగా వుంది సావిత్రికి.

*** *** ***

పైటకొంగుతో కళ్ళు తుడుచుకుని చుట్టూ చూసింది. ఇంతకు ముందుకంటే రెట్టింపయ్యారు జనం. హాలంతా కోలాహలంగా వుంది.

కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఒక్కొక్కరినీ వేదిక మీదకు పిలిచారు. చివరగా 'రంగనాథం గారి సతీమణి శ్రీమతి సావిత్రి గారు వేదిక మీదకు రావాలి' అన్న అనౌన్సమెంటు విన్పించడంతో సావిత్రి లేచి నిలబడింది. పిల్లలు కళాధర్, భూమిక వచ్చి సాయంగా నిలబడ్డారు. వేదిక మీదకు వెళ్ళి కూర్చుంది సావిత్రి.

రంగనాథం కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమ సభ అది. కళాభిమానులు, రంగనాథం శిష్యులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేదిక మీద ప్రసంగించిన వక్తలంతా రంగనాతం వ్యక్తిత్వ వైశిష్ట్యాన్ని, అతని నిజాయితీ గురించి ప్రస్తుతిస్తూ ప్రసంగించారు ఆయన్ని గుర్తు చేసుకుంటూ. చివరగా సావిత్రిని రంగనాథం విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించవలసిందిగా కోరారు. ఒక స్విచ్ నొక్కితే కర్టెన్ నెమ్మదిగా తొలగిపోతోంది. సావిత్రిని ఏదో ఉద్వేగం ఆవహించింది. శరీరం చిన్నగా కంపిస్తోంది. తన భర్త విగ్రహాన్ని తానే ఆవిష్కరించడం ఒక మంచి జ్ఞాపకం అయినా భర్త స్మృతులను కదపడంతో ఆమె ఉద్విగ్నతకు లోనయింది.

స్వచ్ఛమైన చిరునవ్వు చిందిస్తున్న రంగనాథం విగ్రహాన్ని చూసింది. "కళకు మరణం లేదు, నిజమైన కళాకారుడు ప్రజల హృదయాల్లో జీవిస్తాడు" అని క్రింద వ్రాసిన కొటేషన్ చదవగానే ఆమె కను కొలకుల్లోంచి అశ్రువులు రాలాయి. కొద్ది క్షణాలపాటు రెప్పవాల్చకుండా చూస్తుండాపోయింది. తర్వాత మైక్ దగ్గరికి వచ్చి ఎలాగో గొంతు పెగుల్చుకుని "రంగనాథం గారి జీవితం పరమార్థమైయంది. నా జన్మ ధన్యమైంది, మీకందరికీ నా కృతజ్ఞతలు" అని నమస్కరిస్తూ రెండు మాటలు మాట్లాడి కూర్చుంది. హాలంతా చప్పట్లతో మార్మోగిపోయింది. అవి నిజమైన అభిమానంతో కూడిన చప్పట్లు. ఆ కరతాళ ధ్వనులకు, వారి అభిమానానికి ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.